# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 03-05-2017**

జూన్ 2 నుంచి 10వరకు హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని ఈ మహాసభలు నిర్వహిస్తామన్నారు. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ మహాసభలు జరుగుతాయని ప్రకటించారు. తెలంగాణ సాహిత్య అకాడమీతో పాటు సంగీత - నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, జానపద అకాడమీలను కుడా ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. చక్కటి తెలుగు భాష, చక్కటి కవిత్వం తెలంగాణలో ఉందని తెలంగాణ సాహితీ ప్రభావం ప్రపంచానికి చాటేందుకు ఈ అకాడమీలు వేదికలు కావాలని సీఎం అన్నారు.

తెలుగు మహాసభల నిర్వహణకు సంబంధించి ప్రగతి భవన్ లో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ కేవీ రమణాచారి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శ్రీ అయాచితం శ్రీధర్, రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ శ్రీ మామిడి హరికృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షుడు శ్రీ దేవులపల్లి ప్రభాకర్ రావు, ప్రముఖ సాహితీ వేత్తలు శ్రీ నందిని సిధారెడ్డి, శ్రీ వర్ధుల శివకుమార్, సీపీఆర్ఓ శ్రీ వనం జ్వాల నర్సింహారావు, సీఎం ఓఎస్డీ శ్రీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యావత్ ప్రపంచం గుర్తించే విధంగా, చరిత్రలో చిరస్థాయిలో నిలిచేలా సభలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. తెలుగు మహాసభలు సందర్భంగా తెలంగాణ సాహితీ వైభవాన్ని చాటే విధంగా హైదరాబాద్ లో హోర్డింగులు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఈ మహాసభలకు దేశ, విదేశాల్లో ఉన్న సాహితీ ప్రియులను, తెలుగు భాష అభిమానులను ఆహ్వానించాలని సీఎం పేర్కొన్నారు. మహాసభల్లో భాగంగా అవధానాలు, కవి సమ్మేళనాలు, వివిధ సాహిత్య ప్రక్రియలపై సదస్సులు నిర్వహించాలని, తెలంగాణ కవుల అముద్రిత గ్రంథాలను వెలుగులోకి తీసుకురావాలని సీఎం చెప్పారు.

సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా శ్రీ సిధారెడ్డి

---------------------------------------------------

ప్రముఖ కవి, సాహితీవేత్త శ్రీ నందిని సిధారెడ్డిని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా నియమించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**